క్లుప్తంగా

ఘనంగా సింగాలమ్మ ఆలయ వార్షికోత్సవం


అన్న సమారాధన చేస్తున్న కమిటీ సభ్యులు

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు శివలింగపురంలో గల సింగాలమ్మ అమ్మవారి ఆలయ 20వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానికులు అమ్మవారికి పసుపు కుంకుమతో ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ గంకల కవిత, బీజేపీ వార్డు అధ్యక్షుడు అప్పారావు, తదితరులు సింగాలమ్మకు ప్రత్యేక పూజలు చేసి అన్న సమారాధన ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్నప్రసాదం అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం నేడు


కరపత్రాలు అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మద్రిపాలెం : జీవీఎంసీ 50వ వార్డులో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. సంఘ సేవకులు సనపల సూర్యనారాయణ స్వామి వర్ధంతిని పురస్కరించుకుని తెన్నేటినగర్ పార్కులో కళ హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి సౌజన్యంతో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిరహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నంబాల ఈశ్వరరావు, తమ్మినేని వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం శిబిరానికి సంబంధించిన కరపత్రాలను మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లో పంపిణీ చేశారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో బాలభోగం, అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం విశేష హారతి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

- జీవీఎంసీ 53వ వార్డు శివనగర్ రోడ్డు గోతులమయం
- రాకపోకలకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు


గుంతలా మారిన మ్యాన్‌హోల్


శివనగర్ రోడ్డులో ఓ ఇంటి ముందు గొయ్యి


శివనగర్‌లో మలుపు వద్ద ప్రమాదకరంగా రోడ్డు అంచు

మద్రిపాలెం : జీవీఎంసీ 53వ వార్డు శివనగర్ రోడ్డు గోతులమయమై అధ్వానంగా తయారవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

బీఆర్‌టీఎస్ మలుపు నుంచి శివనగర్ రోడ్డు పట్టణ ఆరోగ్య కేంద్రం వరకు ఇబ్బందికరంగా మారింది. శివనగర్ భారత్ పెట్రోల్ బంకు నుంచి సుమారు 300 మీటర్ల మేర అడుగడుగునా గోతులే ఉన్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆ ప్రాంతంలో ఓ పక్క ఇళ్లు, మరోవైపు ప్రధాన గెడ్డ ఉన్నాయి. శివనగర్ వద్ద మలుపులో రోడ్డు అంచు చాలా ప్రమాదకరంగా తయారైంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా, చీకటి వేళల్లో అటుగా ప్రయాణాలు చేసేటప్పుడు పడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సుమారు 30 నుంచి 40 అడుగుల వెడల్పున్న రోడ్డు గెడ్డ వైపు ప్రమాదకరంగా మారిందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఒక్కొక్కసారి వీధి దీపాలు వెలగకపోతే, కొత్తవారు ఎవరైనా అటుగా ప్రయాణాలు చేస్తే పడిపోయే ఆస్కారం ఎక్కువగా ఉందంటున్నారు. ఆ రోడ్డు ఇరువైపులా వాహనాలు వచ్చిపోతుంటాయి. అంతేకాక పాదచారులు, స్థానికులు అలాగే వెళ్తుంటారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాసేపు వారు రోడ్డుపై ఆగి... వాహనాలు వెళ్లిపోయిన తర్వాత వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకేసారి రెండు మూడు వాహనాలు వస్తే అవి వెళ్లేంత వరకు నిరీక్షణ తప్పదని స్థానికులు అంటున్నారు. రెండు కార్లు ఎదురెదురుగా వచ్చినా గెడ్డ అంచున ప్రమాదం పొంచి ఉందని భయపడుతున్నారు. ఆ అంచు ఎవరూ గమనించకుండా డ్రైవ్ చేస్తే గెడ్డలో పడిపోయే ప్రమాదం ఉంది.

సిబ్బంది నిర్లక్ష్యంతో ఇబ్బందులు

శివనగర్ రోడ్డులో కిలోమీటర్ మేర సుమారు 10 వరకూ మ్యాన్ హోల్స్ ఉన్నాయి. అవి కూడా గుంతలుగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాస్తవానికి మ్యాన్‌హోల్ మూసేశాక చుట్టూ సిమెంట్‌తో పూడ్చుతారు. కానీ ఇక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదు. పనిచేశామా..., వదిలేశామా అన్నట్టు ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా పనిచేయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఇళ్ల ముందు గుంతలతో నివాసులు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి గుంతలు ఆ రోడ్డులో రెండు మూడు ఉండడంతో ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని, టైర్లు ఆ గుంతల్లో పడడం వల్ల తొందరగా పాడవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డకు ఆనుకుని కనీసం ఒక అడుగు ఎత్తు డివైడర్‌లా నిర్మిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి గుంతలు పూడ్చి, మ్యాన్‌హోల్స్ చుట్టూ మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం



వాకర్స్ క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న ఏహెచ్ఎన్ వెంకటరావు

మురళీనగర్ : వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు, వాకర్స్ ఫౌండేషన్ ట్రస్టీ ఏహెచ్ఎన్ వెంకటరావు అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన శనివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నడక, ఆరోగ్యానికి సంబంధించి ప్రజల్లో చైతన్యం కల్పించడమే కాకుండా పరిసరాల్లో పచ్చదనం పరిరక్షణ, ప్రజల ఆరోగ్య రక్షణకు మెగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. క్లబ్ అధ్యక్షుడు చంద్రమౌళి మాట్లాడుతూ తమ కార్యవర్గం ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అనంతరం 'వాకర్స్ వాయిస్' నవంబర్ సంచికను ఏహెచ్ఎన్ వెంకటరావు ఆవిష్కరించారు. 2025 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి నిమ్మగడ్డ బుచ్చయ్య ఈ నెల 11న ప్రకటిస్తారని తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, పూర్వాధ్యక్షులు ఎం.భాస్కరరావు, కె.ద్వారకానాథ్, సంయుక్త కార్యదర్శి చొల్లంగి ప్రసాదరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, ఎస్.రామ్మోహన్‌రావు, ఆర్.నాగేశ్వరరావు, వి.అప్పారావు, కె.ఎస్.ప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, పి.వెంకటరత్నం పాల్గొన్నారు.

గురునానక్ జయంతి నేడు

సీతమ్మధార : సిక్కుల గురువు గురునానక్ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహిస్తామని గురుద్వారా సత్సంగ్ అధ్యక్షుడు డీఎస్ ఆనంద్ శనివారం తెలిపారు. నగరంలోని గురుద్వారాలో ఆదివారం నగర్ కీర్తన్ నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ జెండా ఊపి నగర్ కీర్తన్ ప్రారంభిస్తారన్నారు. ఈ ర్యాలీ సీతంపేట, ఆర్టీసీ కాంప్లెక్స్, పాత జైలు రోడ్డు, సెవెన్ హిల్స్, సిరిపురం, ఆర్కే బీచ్, పామ్ బీచ్, కాళీమాత గుడి నుంచి రామాటాకీస్, సత్యం జంక్షన్ మీదుగా తిరిగి రాత్రి 7 గంటలకు గురుద్వారా వద్దకు చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా సిక్కు జెండాలతో అలంకరించిన నిషాన్ సాహిబ్ వాహనం ర్యాలీలో పాల్గొంటుందని తెలిపారు. సిక్కు సోదరులంతా జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

సీతంపేట : ప్రెసిడెన్షియల్ స్కూల్ 30వ వార్షికోత్సవం జెనిసిస్ పేరిట అక్కయ్యపాలెం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. స్కూల్ వ్యవస్థాపకుడు డి.ఎస్.ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను ఎంపీ శ్రీభరత్ ప్రారంభించారు. అనంతరం స్పేస్‌ల్యాబ్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞతో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ దేబాసిష్ చక్రవర్తి, టింపనీ స్కూల్ డైరెక్టర్ వందన అబ్రహాం, ఇంటర్నేషనల్ క్రికెటర్ శ్రీకర్ భరత్ స్కూల్ మాస పత్రిక నవంబరు సంచిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, పాటలు, స్కిట్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలి

- చర్చా వేదికలో పలు సంఘాలు, పార్టీల నేతల డిమాండ్


మాట్లాడుతున్న సంగటి మనోహర్ మహాజన్

సీతంపేట : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా జరుగుతున్న ఎన్నికల విధానానికి స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని దళిత, బహుజన సంఘాల నాయకులు, పలు పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఎన్నికల అక్రమాలు, ఈవీఎంల అవకతవకలు, జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తూ స్థానిక రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపకుడు సంగటి మనోహర్ మహాజన్ మాట్లాడుతూ ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయవచ్చనే విషయాన్ని అనేక మంది నిపుణులు నిరూపిస్తున్నారని తెలిపారు. అధికార పార్టీ ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందని ఆరోపించారు. అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ పేపర్ వినియోగిస్తున్నారని తెలిపారు. గతంలో 40 వేల ఈవీఎంలు కనిపించలేదని, అవి ఎలా మాయమయ్యాయన్న ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ నుంచి ఇప్పటికీ సమాధానం లేదన్నారు. రాజ్యాంగాన్ని మార్చివేసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే రాజ్యాధికారం సాధించాలన్నారు. సమావేశంలో ఆర్‌పీఐ జాతీయ ఉపాధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ఏఎంసీ ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, బూసి వెంకటరావు, ఎస్.ఆర్.వేమన, చింతాడ సూర్యం, సుధాకర్, కొత్తపల్లి వెంకటరమణ, వసంత రాజేంద్రప్రసాద్ తమ అభిప్రాయాలు వెల్లడించారు.

శరవేగంగా బ్యాడ్మింటన్ అకాడమీ పనులు


తోటగరువు వద్ద జరుగుతున్న బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణ పనులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన అంతర్జాతీయ క్రీడాకారిణి పి.వి.సింధు బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇక్కడ మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని పి.వి.సింధు అకాడమీ కోసం కేటాయించిన విషయం తెలిసిందే. ఆ స్థలాన్ని ఇటీవల ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు అప్పగించింది. దీంతో ఈ స్థలంలో పి.వి.సింధు ఈ నెల 7న తల్లిదండ్రులతో కలసి భూమిపూజ చేశారు. ఏడాదిలో ఇక్కడ అకాడమీ నిర్మాణం పూర్తి చేస్తామని సింధు వెల్లడించారు. అప్పటి నుంచి ఇక్కడ నిరాటంకంగా పనులు జరుపుతున్నారు. స్థలం చుట్టూ ఎత్తయిన రేకులతో ఫెన్సింగ్ వేశారు. దాని లోపల పొక్లెయిన్‌తో స్థలం చదును చేయించి పనులు జరిపిస్తున్నారు. దీంతో ఆరిలోవ ప్రాంతంలో అంతర్జాతీయ స్పోర్ట్స్ అకాడమీ అందుబాటులోకి రానుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు

అల్లిపురం: కార్తీక మాసం రెండవ శనివారం సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామి వారిని పలు రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. మంగళవారం 12వ తేదీన కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఆ రోజు తెల్లవారి 4 గంటల నుంచి అర్చన అనంతరం దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు.

శిశువుకు మెడికవర్ వైద్యుల పునర్జన్మ

ఎంవీపీకాలనీ: 510 గ్రాముల బరువుతో జన్మించిన శిశువును ఎంవీపీకాలనీలోని మెడికవర్ వైద్యులు సంరక్షించారు. విజయనగరానికి చెందిన రమాదేవికి 25 వారాల ముందస్తు ప్రసవం కారణంగా శిశువు అవయవాలు పూర్తిగా పరిపక్వత చెందలేదు. డాక్టర్ సాయి సునీల్ కిశోర్, డాక్టర్ మౌనిక, డాక్టర్ విజయ్, డాక్టర్ శ్రీరాంలతో కూడిన ఆస్పత్రి నియోనాటాలజిస్టుల బృందం ఈ శిశువు సంరక్షణను సవాల్‌గా స్వీకరించింది. 107 రోజుల పాటు వైద్య సేవలందించి శిశువుకు పునర్జన్మనిచ్చింది.

అపరిపక్వంగా ఉన్న శిశువు ఊపిరితిత్తులను అభివృద్ధి చేసేందుకు, పనితీరును మెరుగుపరచేందుకు వీలుగా వైద్యులు సర్ఫాక్టెంట్ ఇంజెక్షన్లను అందించారు. అలాగే శ్వాస తీసుకోవడంలో సహాయపడేందుకు 25 రోజులు ఇన్వాసివ్ వెంటిలేషన్, మరో 30 రోజులు నాన్ ఇన్వాసివ్ వెంటిలేషన్ అందించారు. శిశువు సన్నని కేంద్ర రేఖల ద్వారా పోషకాహారం అందించడంతో పాటు ప్రత్యేకమైన పాలు అందించారు. వైద్యుల కృషి ఫలితంగా 510 గ్రాముల బరువున్న శిశువు 1.65 కిలోలకు పెరిగి ఆరోగ్యంగా ఉంది. శిశువును శనివారం తల్లికి అప్పగించారు. ఈ సందర్భంగా వైద్యులకు రమాదేవి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది.

ఫిషింగ్ హార్బర్‌లో పోర్టు చైర్మన్ ఆకస్మిక పర్యటన


ఫిషింగ్ హార్బర్‌లో పర్యటిస్తున్న పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఆదేశించారు. శనివారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో పలు అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. హార్బర్‌లో పలు ప్రాంతాలను పర్యటించి మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హార్బర్‌లో పరిశుభ్రతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, దీనిపై మత్స్యకారులు కూడా పూర్తి సహకారం ఇవ్వాలన్నారు. అభివృద్ధి పనుల మీద చీఫ్ ఇంజినీర్(సీఈ) ప్రతి వారం పర్యవేక్షణ చేయాలని, హార్బర్‌లో మత్స్యశాఖ, బోటు ఓనర్స్ అసోసియేషన్ నాయకులతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలకు అనుగుణంగా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. చేపలు విక్రయిస్తున్న మహిళల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు, వివిధ మత్స్యకార సంఘాలు నాయకులు మైలపల్లి లక్ష్మణరావు(మరపడవల సంఘం అధ్యక్షుడు), బి.కొండబాబు(డాల్ఫిన్ బోటు ఓనర్స్ అధ్యక్షులు), సిహెచ్ వీర్రాజు, ఎస్.నరసింగరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

అభయకు న్యాయం చేయాలని ధర్నా


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కంచరపాలెం: కోల్‌కతా ఆర్‌జీకార్ ఆస్పత్రిలో అత్యాచారం, హత్యకు గురైన వైద్యురాలు అభయకు న్యాయం చేయాలని, సీబీఐ విచారణను సత్వరమే పూర్తి చేయాలని జ్ఞానాపురం పాత లారీ యార్డ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పీవోడబ్ల్యూ - ఐఎఫ్‌టీయూ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ఐఎఫ్‌టీయూ నాయకుడు వై.కొండయ్య ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాల వైఖరిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పీవోడబ్ల్యూ ఉపాధ్యక్షురాలు కె.బాలనాగమ్మ, ప్రధాన కార్యదర్శి రోహిణి, కమిటీ సభ్యులు లక్ష్మి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఇళ్లు రానివారికి డిపాజిట్ల వాపస్


చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : గతంలో దరఖాస్తు చేసుకున్నా ఇళ్లు రాని వారికి రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్లు వాపస్ చేసింది. ఇటీవల ఉత్తర నియోజకవర్గానికి చెందిన 43 మంది దరఖాస్తుదారులకు రూ.9.01 లక్షల మేరకు డిపాజిట్లు వాపస్ చేసింది. ఈ మేరకు సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద గల బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దరఖాస్తు చేసిన వారికి ఇళ్లు రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్లు జోనల్ కార్యాలయం ద్వారా వాపస్ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జోన్ – 5 జోనల్ కమిషనర్ రాము, యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పుణ్యవతి, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, తదితరులు పాల్గొన్నారు.

యువతి మృతదేహం రాజమండ్రి తరలింపు

సీతమ్మధార : నగరంలోని బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో ఆత్మహత్య చేసుకున్న యువతి సత్యప్రియ (31) మృతదేహానికి కేజీహెచ్‌లో శనివారం పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం ఆమె మృతదేహాన్ని అంబులెన్సులో తల్లి శ్రీ వెంకట రమణి, ఇతర బంధువులు రాజమండ్రి తరలించారు. భర్త, అత్తింటివారి వేధింపులు భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. భర్త కార్తికేయ, మామ సూర్యచంద్రరావు, అత్త శైలజను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. మృతురాలి తల్లి శ్రీవెంకటరమణి, ఇతర బంధువులు మృతదేహం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తన కుమార్తెని అత్తింటివారే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తల్లి ఆరోపిస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కోట్ల రూపాయల కట్నం ఇచ్చినా తన కుమార్తెని ఇలా చూడాల్సి వస్తుందనుకోలేదని విలపించారు. మార్చురీ వద్ద ద్వారకా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కేసుని ఏసీపీ రాంబాబు పర్యవేక్షణలో ద్వారకా స్టేషన్ సీఐ బీవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకు పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న శోభన్ ప్రకాష్, సునీత, గంగాధర్, పరశురామరాజు, తదితరులు

సీతంపేట : రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో బాలల దినోత్సవ పోటీలు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏడు నుంచి పదో తరగతి విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించడానికి ఈ నెల 12 వరకు పోటీలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. పాటలు, వ్యాసరచన, ఎలక్యూషన్, డ్రాయింగ్, వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి రాజేష్ తెలిపారు. పోటీలను రోటరీ జిల్లా పబ్లిక్ ఇమేజ్ ఛైర్‌పర్సన్ శోభన్ ప్రకాష్, క్లబ్ పూర్వ అధ్యక్షుడు పరశురామరాజు, వ్యవస్థాపక అధ్యక్షుడు మహేష్ మొదిలి, రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ కె.సునీత లావణ్య, ప్రోగ్రాం డైరెక్టర్ ప్రశాంతి, క్లబ్ కార్యదర్శి రాజేష్‌కుమార్, క్లబ్ సభ్యులు కూటికుప్పల ప్రసాద్, కిరణ్‌కుమార్, శ్రీవల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా శోభన్ ప్రకాష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా గత వంద సవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోలియో వ్యాధి నిర్మూలనకు చేస్తున్న కృషిని, చేరుకున్న మైలురాళ్లను వివరించారు. కార్యక్రమంలో రోటరీ అనుబంధ సంస్థ కైట్స్ జూనియర్ కళాశాల ఇంటరాక్ట్ క్లబ్ సభ్యులు పోటీలను పర్యవేక్షించారు.

డాక్టర్ బాబూరావు మృతికి సంతాపం


డాక్టర్ బాబూరావు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కప్పల బాబూరావు శనివారం మృతి చెందారు. మాధవధారలో నివసిస్తున్న ఆయన కొద్దికాలంగా అస్వస్థతతో బాధపడుతున్నారు. శనివారం సాయంత్రం మృతి చెందినట్లు సావిత్రి భాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బాబూరావు ఇండియన్ రైల్వేలో మెడికల్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. స్వతహాగా రచయిత అయిన బాబూరావు అమరావతి విశ్వసాహితికి అధ్యక్షుడిగా పనిచేశారు. సావిత్రిభాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగు ట్రస్టీగా, అవయవదాన ఉద్యమానికి తన వంతు సహకారం అందించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా పని చేశారు. విద్యాదాతగా, వెటరన్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన తన అవయవాలను, శరీరాన్ని మెడికల్ రీసెర్చ్ కోసం దానం చేశారు. నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి, పార్థివదేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీకి సోమవారం అందిస్తామని స్వెక్ట్ ఛైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి తెలిపారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ప్రభుత్వ విధానాలతో ప్రజలకు కష్టాలు


మహాసభలో మాట్లాడుతున్న గంగారావు

కంచరపాలెం : కంచరపాలెం బొట్టా నర్సింగరావు భవనలో శనివారం సీపీఎం కంచరపాలెం జోన్ 9వ మహాసభ నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు అరుణ్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం సీపీఎం అలిండియా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి, జిల్లా నాయకులు కామ్రేడ్ ఆర్‌పీ రాజు, కామ్రేడ్ ఎ.పుష్పాంజలి సాహు చిత్రపటాలకి నివాళులర్పించారు. మహాసభను ఉద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ గంగారావు, బి.జగన్, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. మోదీ, చంద్రబాబు ప్రభుత్వాల విధానాలతో ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. ధనవంతులు, కార్పొరేట్ యజమానుల ప్రయోజనాల కోసం మాత్రమే మోదీ, చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. దేశ సంపదను, ప్రజల కష్టాన్ని, ఆస్తులను కార్పొరేట్లు పీక్కు తింటున్నారన్నారు. ధరలు భారీగా పెంచేయడంతో సామాన్యులపై ఆర్థిక భారం పెరిగిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ని తీవ్రంగా దెబ్బతీశారని ఆరోపించారు. ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం కంచరపాలెం జోన్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన జోన్ కార్యదర్శిగా మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, జోన్ కమిటీ సభ్యులుగా యూఎస్ఎన్ రాజు, ఒమ్మి అప్పారావు, బి.సింహాచలం, ఎం.ఈశ్వరరావు, జి.రమణ, ఎస్.శ్రావణ్, జి.అప్పలరాజు, పి.గౌరీష, టి.లక్ష్మీకాంతం, ఒమ్మి విజయ, ఆర్ఎస్ మాధవి, కె.సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బి.పద్మ తదితరులు పాల్గొన్నారు.